పట్టణ పేదలకు ఆరోగ్య ధీమా

యూపీహెచ్‌సీలతో చేరువైన వైద్యం

- ఇంటికి సమీపంలోనే ఆస్పత్రి ఉండటంతో మేలు
- విస్తృతంగా అందుతున్న సేవలు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



38వ డివిజన్‌లోని అర్బన్ హెల్త్ సెంటర్

భవానీపురం(విజయవాడపశ్చిమ): గత ప్రభుత్వ పాలనలో పేదలకు అందని ద్రాక్షగా మిగిలిపోయింది వైద్యం. అనారోగ్యం చేసి ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలంటే చాలా దూరం వెళ్లాల్సి వచ్చేది. పోనీ దగ్గరలో ఉండే ప్రైవేట్ హాస్పిటల్‌కు వెళదామంటే రూ. వేలు, లక్షలు ఖర్చు చేసే స్తోమత లేక ఇబ్బందులు పడేవారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసింది. నగరంలో పేదలు నివసించే ప్రాంతాల్లో వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు (యూపీహెచ్‌సీ), గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను నిర్మించింది. అందులో భాగంగా పశ్చిమ నియోజకవర్గంలో ఒక్కో హెల్త్ సెంటర్ నిర్మించేందుకు యూపీహెచ్‌సీ గ్రాంట్ కింద ప్రభుత్వం రూ.80లక్షలు మంజూరు చేసింది. తద్వారా పశ్చిమ నియోజకవర్గంలో 38, 42, 45, 47 డివిజన్లలో నాలుగు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రాలను నిర్మించింది. దీంతో నియోజకవర్గంలోని పేద ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించింది. ఒక్కో డివిజన్‌లో నివసిస్తున్న సుమారు 30 వేల మంది జనాభాకు ఉచిత వైద్య సేవలు అందుతున్నాయి.



హెల్త్ సెంటర్‌లో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యుడు(ఫైల్)

అందుబాటులోకి వైద్య సేవలు..

పశ్చిమ నియోజకవర్గంలో నిర్మించిన నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లలో ఒక్కో దానిలో 10 పడకలు ఏర్పాటు చేశారు. రక్త పరీక్షలు చేసి ఫలితాలను తెలిపేందుకు ఒక ల్యాబ్‌ను పెట్టారు. రోగ నిర్ధారణ అయిన తర్వాత ఉచితంగా మందులు పంపిణీ చేసేందుకు ఫార్మసీ, పేషెంట్లకు వెయిటింగ్ హాల్, వైద్యులకు గది తదితర అధునాతన సౌకర్యాలతో కార్పొరేట్ వైద్య సేవలను అందిస్తుండటంతో పేద, మధ్య తరగతి ప్రజల ఆనందం వర్ణనాతీతం. ముఖ్యంగా జీవితంలో భాగమైపోయిన బీపీ, సుగర్ వ్యాధులు ఏ మేరకు ఉన్నాయో తెలుసుకుని వాటిని నియంత్రించేందుకు ఆరోగ్య కేంద్రం వైద్యులు ఇచ్చే మందులను తీసుకోవడం పట్ల వారు హర్షం వ్యక్తం చేస్తున్నారు. అలాగే అన్ని యూపీహెచ్‌సీలు యూనిఫాంగా ఒకే డిజైన్‌లో నిర్మించటం, ఆకర్షణీయమైన రంగులతో తీర్చిదిద్దటం, ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించటం విశేషం.

ఉచితంగా నాణ్యమైన వైద్యం..



గత ప్రభుత్వం పేదలకు ఉచిత వైద్యం అందించాలన్న ఆలోచన కూడా చేయలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచిత వైద్య సేవలకు పెద్ద పీట వేసింది. గతంలో అనారోగ్యం చేస్తే దగ్గరలో ఉన్న ఆర్‌ఎంపీ వైద్యుని దగ్గరకు వెళ్లేవాళ్లం. ఇప్పుడు మాకు దగ్గరలోనే ప్రభుత్వం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేయటంతో అక్కడికే వెళ్లి రక్త పరీక్షలతో సహా వైద్యం చేయించుకోవడంతోపాటు అవసరమైన మందులు కూడా తెచ్చుకుంటున్నాం.

– ఎస్‌కే నజీర్, కుమ్మరిపాలెం సెంటర్

ప్రజలకు చేరువలో..



మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యంలో భాగంగా సచివాలయ వ్యవస్థ ఏర్పాటు చేసి ప్రజల వద్దకే పాలన తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగనన్న వైద్య సేవలను కూడా ప్రజల చేరువలోకి తీసుకువచ్చారు. వైద్య ఖర్చు రూ.1000 దాటితే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా వైద్యం చేయించుకునే విధంగా వెసులుబాటు కల్పించారు. ఎక్కడో దూరంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాల్సిన అవసరం లేకుండా దగ్గరలోని యూపీహెచ్‌సీలను వినియోగించుకోవచ్చు.

– షేక్ రెహమతున్నీసా, 38వ డివిజన్ కార్పొరేటర్

రంజాన్ మతసామరస్యానికి ప్రతీక



ఇఫ్తార్‌లో పాల్గొన్న ఏసీపీ మురళీకృష్ణారెడ్డి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తోందని విజయవాడ వెస్ట్ జోన్ ఏసీపీ మురళీకృష్ణారెడ్డి అన్నారు. రంజాన్ మాసం సందర్భంగా వించిపేట షాహీ మసీదు ప్రాంగణంలో మంగళవారం సాయంత్రం జరిగిన ఇఫ్తార్ కార్యక్రమంలో పలువురు పోలీసు అధికారులు పాల్గొన్నారు. మురళీకృష్ణారెడ్డి మాట్లాడుతూ రంజాన్ మాసం చాలా పవిత్రమైందిగా ఇస్లాం గ్రంథాలు చెబుతున్నాయన్నారు. పేదల ఆకలిదప్పికలు తెలుసుకునేందుకు ఉపవాస దీక్షలను ఆచరిస్తారని, అటువంటి మంచి సందేశాన్నిస్తున్న ఆచారాలు అందరికీ స్ఫూర్తినిస్తాయన్నారు. వెస్ట్‌జోన్‌లో ముస్లిం సోదరులు అధికంగా ఉన్నారని, వారందరికీ ఈ రంజాన్ మాసం మేలు చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సీఐలు గణేష్, కృష్ణ, శేఖర్‌రెడ్డి స్థానిక వైఎస్సార్ సీపీ నేత వాహబ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కులమతాలకు అతీతంగా ఉరుసు మహోత్సవం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): ఉరుసు మహోత్సవాలు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. 54వ డివిజన్‌లోని హజ్రత్ అలీ ఆస్థాన పీర్ల పంజా, ఉరుసు మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన ఆసిఫ్ ఇతర ప్రముఖులతో కలిసి ప్రార్థనలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆసిఫ్ మాట్లాడుతూ ఉరుసు మహోత్సవాల్లో ప్రజానీకం కులమతాలకు అతీతంగా హాజరవుతారని చెప్పారు. వారంతా మతాలను పక్కన పెట్టి భగవంతుడిని ప్రార్థిస్తారని చెప్పారు. అటువంటి వారందరికీ మేలు జరగాలని ఆకాంక్షను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ అబ్దుల్ అర్షద్, ముత్తవలీ అన్సారీబేగ్, నాయకులు బాషీ, షేక్ సలీమ్, సుభానిఖాన్ ఉన్నారు.

కోడ్ ఉల్లంఘన.. ఇద్దరిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఎన్నికల నియమావళిని ఉల్లంఘించి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్ ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్న ఇద్దరిపై కొత్తపేట పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఎర్రకట్ట రోడ్డు పరిధిలోని ప్రైజర్‌పేట కటికల వారి వీధి వద్ద మల్లికార్జునపేటకు చెందిన బైపు రామకృష్ణ, కేఎల్‌రావునగర్‌కు చెందిన లండా ప్రశాంత్ కలిసి పవన్‌కల్యాణ్, పోతిన మహేష్‌ల ఫ్లెక్సీలతో సంతకాల సేకరణ చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఘటనా స్థలానికి చేరుకునే సరికి రోడ్డుపై వెళ్లే వారిని ఆపి, ఇద్దరికి మద్దతుగా సంతకాల సేకరణ చేస్తున్నట్లు టీం సభ్యులు గుర్తించారు. సంతకాల సేకరణ చేస్తున్న వారు ఎన్నికల రిటరి్నంగ్ అధికారి నుంచి ఏమైనా అనుమతి తీసుకున్నారా అని ప్రశ్నించారు. అయితే ఎటువంటి అనుమతి తీసుకోలేదని సదరు యువకులు పేర్కొనగా, వారిపై కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ గణేష్ కేసు నమోదు చేశారు.

కిటకిటలాడిన దాసాంజనేయ స్వామి దేవాలయం

మధురానగర్(విజయవాడసెంట్రల్): స్వయంభూ మాచవరం దాసాంజనేయ స్వామివారి దేవాలయం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఇంటర్మీడియట్, పదో తరగతి పరీక్షలు ముగియడంతో పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఆలయానికి చేరుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రీతికరమైన సిందూరం, ఆకు పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వాహన చోదకులు వాహన పూజలు చేయించుకున్నారు. కార్యక్రమాలను ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని పర్యవేక్షించారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతి

విజయవాడస్పోర్ట్స్: ఈ నెల ఒకటో తేదీ తెల్లవారు జామున బీఆర్‌టీఎస్ రోడ్డులో జరిగిన ప్రమాదంలో గాయాల పాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యాచకుడు మృతి చెందినట్లు సూర్యారావుపేట సీఐ వి.దుర్గారావు తెలిపారు. బీఆర్‌టీఎస్ రోడ్డులో నిద్రిస్తున్న యాచకుడిపై గుర్తు తెలియని వాహనం వెళ్లడంతో అతనికి తీవ్రంగా గాయాలయ్యాయన్నారు. ఈ విషయం గమనించిన సమీపంలోని వ్యక్తులు అతన్ని 108లో ప్రభుత్వాస్పత్రికి తరలించారన్నారు. చికిత్స పొందుతూ మంగళవారం యాచకుడు మృతి చెందినట్లు సీఐ వెల్లడించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

ఘనంగా అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా బాలల పుస్తకాల ప్రదర్శన ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థుల చేత పుస్తకాలు చదివించారు. గ్రంథాలయాధికారి రమాదేవి మాట్లాడుతూ చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ మంచి పుస్తకం కొనుక్కో, మంచి పుస్తకం మంచి మిత్రుడు లాంటిది, ఒక మంచి పుస్తకం జీవితాన్ని మారుస్తుంది అని కందుకూరి వీరేశలింగం చెప్పిన మాటలు విద్యార్థులకు వివరించి పుస్తకం విలువను తెలియజేశారు. 10 మందితో వృథాగా కాలక్షేపం చేసే బదులు ఒంటరిగా కూర్చుని ఒక మంచి పుస్తకం చదవడం మేలన్నారు. పుస్తక పఠనంతో మేధస్సు పెరుగుతుందన్నారు. ఎన్నో విలువైన పుస్తకాలను గ్రంథాలయంలో అందుబాటులో ఉంచడం జరిగిందని పేర్కొన్నారు.

బీసీ, మైనారిటీలకు 'కూటమి' పోటు

- 54వ డివిజన్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఎంపీ కేశినేని నాని
- గొప్ప సంస్కరణలు అమలు చేసిన సీఎం జగన్
- వెస్ట్‌లో ఆసిఫ్‌ను గెలిపించి సీఎంకు బహుమతిగా ఇద్దామని పిలుపు



సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తున్న కేశినేని నాని, షేక్ ఆసిఫ్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో బీసీ, మైనార్టీలను, చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లు మోసం చేశారని విజయవాడ లోక్‌సభ సభ్యుడు కేశినేని నాని అన్నారు. రాష్ట్రంలో బీసీ, మైనార్టీ వర్గాలకు సరైన సీట్లు కేటాయించకుండా వెన్నుపోటు పొడిచారని ఆయన ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్‌తో కలిసి కేశినేని నాని పాతబస్తీలోని 54వ డివిజన్‌లో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేశినేని నాని విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ కల్యాణ్ కలిసి మైనారిటీలు, బీసీలకు వెన్నుపోటు పొడిచి కార్పొరేట్ కుబేరుడు సుజనా చౌదరికి టికెట్ ఇచ్చారన్నారు. కానీ ప్రజలు డబ్బులు చూసి ఓటు వేయరని, నిరంతరం ప్రజల మధ్య ఉంటున్న స్థానికుడు ఆసిఫ్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తారని చెప్పారు. సీఎం జగన్ ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థల ద్వారా గొప్ప పాలనా సంస్కరణలు అమలు చేసి ప్రజలకు పాలనను చేరువ చేశారన్నారు. విద్య, వైద్య రంగాలను సమూలంగా మార్చివేసి ప్రజలకు ఎంతో మేలు చేశారన్నారు.

పెత్తందారుల విషం..

వలంటీర్స్ వ్యవస్థ మీద, జగన్ చేస్తున్న సంక్షేమం మీద కొందరు పెత్తందారులు విషం చిమ్ముతున్నారని ఎంపీ అన్నారు. చంద్రబాబు, పవన్, బీజేపీ నేతలు, కుట్ర పూరితంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. చంద్రబాబుకు ఓటేస్తే వలంటీర్ వ్యవస్థ ఉండదని, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తీసేస్తారని, ఆర్బీకేలను ఎత్తివేస్తారని చెప్పారు. జగన్ చేసిన ప్రజా సంస్కరణలు అన్నింటినీ కూడా రద్దు చేస్తారనడానికి వలంటీర్లపై ఫిర్యాదులు చేయటమే నిదర్శనమన్నారు. ప్రజలందరూ ఆలోచన చేసి.. ఫ్యాన్ గుర్తు మీద వేసి మళ్లీ సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలన్నారు.

దుర్మార్గ కూటమి..

షేక్ ఆసిఫ్ మాట్లాడుతూ వలంటీర్లపై తప్పుడు ఫిర్యాదులు చేసి వృద్ధులు, దివ్యాంగులకు ఒకటో తేదీన పింఛన్లు అందకుండా చేసిన దుర్మార్గులు చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడు పవన్‌కల్యాణ్ అని ఆగ్రహం వ్యక్తంచేశారు. వృద్ధులు, దివ్యాంగులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు వంటి అభాగ్యులను ఇబ్బందులకు గురిచేసి చంద్రబాబు, పవన్ సాధించేది ఏమిటని ప్రశ్నించారు. డబ్బుతో ఏదైనా చేయగలనని సుజనా చౌదరి చెబుతున్నారని, ఆయన డబ్బులకు అమ్ముడుపోయేవారు పశ్చిమ నియోజకవర్గంలో ఎవరూ లేరన్నారు. గతంలో ఆయన కంటే బడా బాబులు వచ్చి డబ్బులతో రాజకీయాలు చేయాలని ప్రయత్నించి ఘోరంగా ఓడిపోయారన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సుజనా చౌదరికి, రాష్ట్రంలో చంద్రబాబు, ఆయన దత్తపుత్రుడికి భంగపాటు తప్పదన్నారు. కార్యక్రమంలో మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఏపీ ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్ పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, కార్పొరేటర్లు అర్షద్, శిరం శెట్టి పూర్ణచంద్రరావు, ఇర్ఫాన్, మరుపిళ్ల రాజేష్, గుడివాడ నరేంద్ర, చైతన్యరెడ్డి, యలకల చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కాపులకు అత్యధిక ప్రాధాన్యమిచ్చిన సీఎం జగన్



ఆసిఫ్‌ను సత్కరిస్తున్న మాధవరావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కాపులకు అత్యధిక సీట్లు కేటాయించి వారికి అండగా ఉన్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. పార్టీకి చెందిన కాపు నేత వద్దాది మాధవరావును షేక్ ఆసిఫ్ ఆయన కార్యాలయంలో మంగళవారం కలిసి పార్టీ విజయానికి పాటుపడాల్సినదిగా విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మాధవరావు షేక్ ఆసిఫ్‌కు స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం ఆసిఫ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 31 సీట్లకు పైగా కాపులకు కేటాయించిన గొప్ప ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. అలాగే ఐదు ఎంపీ సీట్లను కూడా కాపులకు కేటాయించారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కాపు కార్పొరేషన్ ద్వారా వేలాది కోట్ల రూపాయలను జగన్ ప్రభుత్వం ఖర్చు చేసిందన్నారు. 45 సంవత్సరాలు దాటిన మహిళలకు కాపు నేస్తం ద్వారా ఆర్థిక సాయమందించి అండగా ఉన్నారని వివరించారు. రానున్న కాలంలో కాపు సోదరులందరూ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. కార్పొరేటర్ యలకల చలపతిరావు, నాయకులు పోతిన శంకర్, మజ్జి శ్రీనివాసరావు, మురళీ, దుర్గారావు, పి. విజయ భాస్కర్, మండల శ్రీనివాసరావు, మద్ది మురళీ, కర్రి గౌరి, దొడ్ల రాజా తదితరులు పాల్గొన్నారు.

'పారిజాత పర్వం' అలరిస్తుంది



మాట్లాడుతున్న పారిజాత పర్వం మూవీ హీరో చైతన్యరావు, చిత్రంతో హీరోయిన్ శ్రద్ధాదాస్

విజయవాడస్పోర్ట్స్: విజయవాడ నగరంలో పారిజాత పర్వం చిత్ర యూనిట్ మంగళవారం సందడి చేసింది. చిత్ర ప్రమోషన్‌లో భాగంగా ఓ హోటల్లో చిత్ర యూనిట్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో చైతన్యరావు మాట్లాడుతూ కిడ్నాప్ కామెడీ డ్రామాతో పూర్తిస్థాయి వినోదాత్మక చిత్రమన్నారు. ఒక కిడ్నాప్ ఇతివృత్తంగా ఈ చిత్రం సాగుతుందని, ప్రముఖ నటులు సునీల్ ఈ చిత్రంలో ఒక మంచి పాత్రలో కనబడతారని, ఆయన పాత్ర ఈ చిత్రానికి హైలైట్ గా ఉంటుందని వివరించారు. హీరోయిన్ శ్రద్ధాదాస్ పలు క్యారెక్టర్లలో నటించిందని ఈ చిత్రంలో ఆమె నటన ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చెప్పారు. ఇప్పటికే విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభించడం సంతోషంగా ఉందన్నారు. ఈనెల 19న థియేటర్లలో రిలీజ్ కానుందని ఈ చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరించాలని ఆయన కోరారు. హీరోయిన్ శ్రద్ధ దాస్ మాట్లాడుతూ కామెడీ సన్నివేశాలు ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయన్నారు. అనంతరం ప్రముఖ కమెడియన్ వైవా హర్ష మాట్లాడుతూ ఈ చిత్రంలో వచ్చే హాస్య సన్నివేశాలు ప్రేక్షకులను ఎంతగానో నవ్విస్తాయని తెలిపారు. దర్శకుడు సంతోష్ కంభంపాటి మాట్లాడుతూ గతంలో ఎన్నో కిడ్నాప్ కామెడీ చిత్రాలు వచ్చాయని ఈ చిత్రం పూర్తి స్థాయి భిన్నంగా ఉంటుందన్నారు.

నిత్యం అందుబాటులో ఉండే నాయకుడు ఆసిఫ్



వించిపేట కొండప్రాంతంలో ప్రచారం నిర్వహిస్తున్న కార్పొరేటర్ పూర్ణచంద్రరావు

వించిపేట(విజయవాడపశ్చిమ): నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, వారి సమస్యలపై తక్షణమే స్పందించి పరిష్కరించే నాయకుడు షేక్ ఆసిఫ్ అని, రానున్న ఎన్నికల్లో ఆయన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించి పశ్చిమ నియోజవర్గం అభివృద్ధికి సహకరించాల్సిందిగా 55వ డివిజన్ కార్పొరేటర్ శిరంశెట్టి పూర్ణచంద్రరావు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థి షేక్ ఆసిఫ్ విజయాన్ని కాంక్షిస్తూ ఆయన కుమారుడు, కుమార్తె జావిద్, రేష్మలతో కలసి పూర్ణాచంద్రరావు 55వ డివిజన్‌లోని సీఎస్‌ఐ చర్చి కొండ ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అన్ని వర్గాల ప్రజలు అనేక పథకాల రూపంలో లబ్ధిపొందుతూ సంతృప్తికరంగా ఉన్నారన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు వారంతా సిద్ధంగా ఉన్నారని అన్నారు. పశ్చిమ నియోజకవర్గం స్వరూపమే తెలియని కొత్త వ్యక్తి ఓట్ల కోసం వస్తున్నారని, ఎన్నికల తర్వాత ఆయన మళ్లీ కనిపించరన్నారు. ప్రతిరోజు మనకు అందుబాటులో ఉండే ఆసిఫ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుని పశ్చిమ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

రోడ్డు భద్రత నిబంధనలను పాటించాలి



గన్నవరం: ప్రమాదాల నివారణకు ఆటో డ్రైవర్లు రోడ్డు భద్రత నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని ట్రాఫిక్ సీఐ వాసా పెద్దిరాజు సూచించారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద మంగళవారం జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ మాట్లాడుతూ.. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించరాదన్నారు. ఆటోలను రద్దీ ప్రాంతాల్లో కాకుండా నిర్ణీత ప్రదేశాల్లో మాత్రమే నిలుపుకోవాలని సూచించారు. లైసెన్స్ లేకుండా డ్రైవర్లు ఆటోలు నడిపితే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారులపై అడ్డదిడ్డంగా ఆటోలను నిలిపిన, రాంగ్ రూట్‌లో నడిపిన జరిమానాలు విధిస్తామన్నారు. పరిమితికి మించిన వేగంతో ఆటోలను నడపడం ప్రమాదకరమని తెలిపారు.

ఆటిజంను ఆరంభ దశలోనే గుర్తించాలి



ఆటిజం గురించి వివరిస్తున్న డాక్టర్ కృష్ణకుమారి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఆటిజం అంటే చైల్డ్‌హుడ్ న్యూరో డెవలప్‌మెంటల్ డిజార్డర్ అని దానిని ఆరంభ దశలోనే గుర్తించి చికిత్స ఇవ్వడం ద్వారా మంచి ఫలితాలు సాధించవచ్చని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ టి. కృష్ణకుమారి అన్నారు. అయోధ్యనగర్ లోటస్ ల్యాండ్ మార్క్‌లోని చేయూత మానసిక వికలాంగుల శిక్షణ సంస్థ కార్యాలయంలో మంగళవారం ప్రపంచ ఆటిజం డే సందర్భంగా అవగాహన కార్యక్రమం జరిగింది. కృష్ణకుమారి మాట్లాడుతూ ఆటిజం అనేది చిన్నారుల్లో ఏడాదిన్నర నుంచి మూడేళ్లలోపు వయస్సులోనే సులభంగా గుర్తించవచ్చని తెలిపారు. చిన్నారులు తక్కిన పిల్లలతో కలవకపోవడం, కళ్లలో కళ్లుపెట్టి చూడకపోవడం, స్పీచ్ అండ్ లాంగ్వేజీ సమస్యలు ఉంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఎప్పటికప్పుడు అన్ని విషయాలు క్షుణంగా పరిశీలించాలని సూచించారు. హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ స్వీకార్ అండ్ ఉపకార్ స్పీచ్ పథాలజిస్టు శృతిపాటిల్ చిన్నారుల్లో స్పీచ్ డిలేకు సంబంధించిన వివిధ రకాల అంశాలను పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు.

రేపటి నుంచి స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కోర్సుల్లో శిక్షణ తరగతులను నిర్వహించనున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4 తేదీ నుంచి కటింగ్ అండ్ టైలరింగ్, హ్యాండ్ ఎంబ్రాయిడరీ, డ్రస్ డిజైనింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, ఎలక్ట్రికల్ టెక్నీషియన్, మెషిన్ ఎంబ్రాయిడరీ, ఏసీ, రిఫ్రిజిరేటర్ మెకానిజం, హోమ్ క్రాఫ్ట్స్, జ్యూస్ అండ్ జామ్ మేకింగ్, టెక్స్‌టైల్ ప్రింటింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, మిర్రర్ వర్క్ అంశాల్లో శిక్షణ తరగతులు జరుగుతాయని వివరించారు. ఆసక్తి ఉన్న యువతీ యువకులు విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లోని తమ సంస్థ కార్యాలయంలో నేరుగా కాని 0866–2470420 నెంబర్‌లో కాని సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

ఎన్నికల్లో మద్యం పంపిణీకి స్వస్తి పలకాలి

కృష్ణలంక(విజయవాడతూర్పు): రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో రాజకీయ పార్టీల అభ్యర్థులు ఉచితంగా మద్యం పంపిణీకి స్వస్తి పలికి ఓటర్లు, కార్యకర్తలు, యువతను కాపాడాలని సిటిజన్స్ ఫర్ డెమొక్రసీ సంయుక్త కార్యదర్శి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ ఆధ్వర్యంలో మంగళవారం 'స్వేచ్ఛాయుత ఎన్నికలు–మద్యం ప్రభావం–నియంత్రణ మన ముందున్న సవాళ్లు' అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో ఉచితంగా మద్యం పంపిణీ వల్ల యువతకు మద్యం అలవాటు అవుతుందన్నారు. అభ్యర్థులు ఖర్చు పెట్టే వ్యయంలో 25శాతం మద్యం పంపిణీకే కేటాయిస్తున్నారని తెలిపారు. తాగుడు తప్పు అనే భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మద్య నిషేధం కన్న నియంత్రణ ఆచరణ సాధ్యమన్నారు. కేంద్ర ప్రభుత్వం మద్యంపై జాతీయ విధానాన్ని ప్రకటించాలని కోరారు. సమావేశంలో జాతీయ మహిళా సమాఖ్య నేత అక్కినేని వనజ, పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.పద్మ, గద్దె అనురాధ, వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

6న సంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాఘవయ్య పార్క్ ఎదురుగా గల మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో ఈ నెల ఆరో తేదీన ఉగాది పురస్కారాల ప్రదానోత్సవం, సంప్రదాయ వస్త్రాలంకరణ పోటీలు జరగనున్నాయి. శ్రీదేవి సాంస్కృతిక సాంఘిక సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ పోటీలుంటాయి. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవి మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఆరో తేదీ శనివారం సాయంత్రం నాలుగు గంటల నుంచి పోటీలు జరుగుతాయన్నారు. పూర్తి వివరాలకు 9440263055లో సంప్రదించాలని కోరారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో విజయవాడకు చెందిన మల్లిశెట్టి అనూష బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి పంచ హారతుల సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలోని కళావేదికపై నృత్య ప్రదర్శన జరిగింది. పలు కీర్తనలకు చిన్నారులు అద్భుతంగా నృత్య ప్రదర్శన ఇవ్వగా, అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు ప్రదర్శనను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించిన దేవస్థాన అధికారులు వారికి ప్రసాదాలను అందజేశారు.